ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జనగామ
శనివారం 13 జూలై 2024

రక్తచరిత్ర

ఓరుగల్లును వణికిస్తున్న హత్యలు

పాత కక్షలు బుసలు కొడుతున్నాయి..
ప్రేమ ఉన్మాదంగా మారుతోంది..
బంధాలు ఉరి తాళ్లవుతున్నాయి..
ఓరుగల్లు రక్తసిక్తం అవుతోంది...

వరుస హత్యలు.. కత్తుల దాడులతో ప్రజలు భీతిల్లుతున్నారు. కట్టుకున్నేడే కాలయమడై కత్తులతో దాడి చేస్తే... ప్రేమించి న పెళ్లి చేసుకున్న అమ్మాయి దక్కలేదని ప్రేమికుడు ఉన్మాదానికి దిగితే.. ప్రాణాలు గాలిలో దీపంలా ఆరిపోతున్నాయి. ఏ క్షణాన.. ఏం జరుగుతుందో అనే భయం నీడలో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హత్యల సంస్కృతి పెరిగి పోతుండటం ఓరుగల్లువాసులను కలవరానికి గురి చేస్తోంది. పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా.. క్షణికావేశంతో చేస్తున్న హత్యలతో కాకతీయ గడ్డ నెత్తురోడుతోంది.


సుగుణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు
వర్ధన్నపేటలో కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన కల్లెం విజయ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

- ఖూనీలకు దారితీస్తున్న క్షణికావేశాలు
- కనుమరుగవుతున్న మానవ సంబంధాలు
- ప్రేమ, భూమి, మనస్పర్థలే కారణాలు
- రెండు నెలల్లో పెరిగిపోయిన నేర ప్రవృత్తి

వరుస హత్యలు, దాడులతో వరంగల్ ఉమ్మడి జిల్లా వణికిపోతోంది. ప్రశాతంగా ఉండే ఓరుగల్లు ప్రాంతంలో రెండు నెలలుగా వరుసగా జరుగుతున్న హత్యలతో ప్రజల్లో భయాందోళన వ్యక్తం అవుతోంది. ప్రధానంగా బంధాలు, బంధుత్వాలు మరిచి సొంతవారినే హతమారు స్తున్న ఘటనలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారు తున్నాయి. చిన్న చిన్న విషయాలకు క్షణికావేశాలకు గురై హత్యలకు పాల్పడతున్నారు. మానవ సంబంధాలు మరిచి మృగాలుగా ఆలోచిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విచ్చలవిడిగా లభిస్తున్న గంజాయి, డ్రగ్స్, మద్యం కూడా నేర ప్రవృత్తిని పెంచేందుకు దోహదపడుతోందనే చర్చ జరుగుతోంది.

తాజాగా శుక్రవారం సాయంత్రం వర్ధన్నపేట మండలం ఇల్లందు గ్రామానికి చెందిన ఊర కృష్ణ పాత కక్షలతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కల్లెం విజయ్‌పై కత్తితో దాడికి దిగారు. అడ్డు వచ్చిన విజయ్ మిత్రుడు రాజ్‌కుమార్‌కు కూడా కత్తి గాయాలయ్యాయి. ఇద్దరు కూడా ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో ఎంజీఎంకు చికిత్స నిమిత్తం తరలించారు. కృష్ణ కుమార్తెను విజయ్ ప్రేమించినట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. అయితే పెద్దమనుషులు విజయ్‌ని మందలించి, అమ్మాయిని మరిచిపోవాలని హెచ్చరిస్తూ రూ.50వేల జరిమానా విధించారు. ఇదే విషయంపై కృష్ణ - విజయ్‌ల మధ్య వివాదం ఉండగా, వన భోజనాల అనంతరం ఇద్దరి మధ్య జరిగిన గొడవ.. కత్తిపోట్ల వరకు వెళ్లింది. అలాగే శుక్రవారం గీసుకొండ మండలం జాన్‌పాక వద్ద రవి అనే వలస కూలీని గుర్తుతెలియని వ్యక్తులు తలపై దాడి చేసి హతమార్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవిపై ఎవరు దాడి చేసి హతమార్చారు..? ఎందుకు హత్య చేశారో? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రోజు రెండు సంఘటనలు జరగటం కలకలం రేపుతోంది.


ఎల్లంబజార్‌లో బండరాయితో కొట్టడంతో మృతిచెందిన వీరభద్రాచారి

భార్య దక్కలేదని..

జూలై 11వ తేదీ గురువారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల 16 చింతల తండాకు చెందిన దీపిక అనే అమ్మాయిని నాగరాజు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్ల తరువాత నాగరాజుతో ఉండలేక దీపిక తన పుట్టింటికి వచ్చేసింది. అయితే దీపిక తనతో కాపురానికి రావటం లేదని నాగరాజు అమ్మాయి ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో ఆరు బయట నిద్రిస్తున్న అమ్మాయి తల్లితండ్రులు బానోతు శ్రీనివాస్, సుగుణలను కత్తి దాడి చేసి హత్య చేశాడు. తనకు ఎదురుగా వచ్చిన దీపికతో పాటు మదన్‌లాల్‌పై దాడికి పాల్పడి పరారయ్యారు. శుక్రవారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. భార్య కాపురానికి రాకపోతే పోలీస్‌స్టేషన్, కోర్టు, లేదంటే పెద్ద మనుషుల సమక్షంలో తేల్చుకోకుండా ఉన్మాదిగా మారి ఇద్దరి ప్రాణాలు తీయటం రాష్ట్రవ్యాప్తంగా రేపుతోంది.

మనస్పర్థలతో..

ఈ నెల 9వ తేదీన వరంగల్‌లోని చెన్నారెడ్డి కాలనీలో మంద చరణ్, స్వప్న దంపతుల మరణం పలువురిని కలిచివేసింది. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో భార్యను హత్య చేసి, తాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. వీరి క్షణికావేశం

మిగతా 6వ పేజీలో..

మరికొన్ని సంఘటనలు

- జూన్ 1వ తేదీన మిల్స్‌కాలనీలోని ఓ బిర్యానీ పాయింట్ వద్ద ఒక రూపాయి విషయంలో తలెత్తిన వివాదంలో ఇసంపల్లి ప్రేమ్‌సాగర్‌ను జన్ను అరవింద్ నెట్టివేయటంతో కింద పడి తలకు గాయాలు కావటంతో ప్రేమ్‌సాగర్ అక్కడిక్కడే మృతి చెందారు.
- జూన్ 22వ తేదీన హనుమకొండ పట్టణంలోని రెవెన్యూకాలనీ నాగేంద్ర నగర్‌లో దంపతుల మధ్య గొడవతో భార్య మంజులను భర్త అశోక్ గొంతు నులిమి హతమార్చారు. ఈ కేసును మరో వ్యక్తిపై నెట్టేందుకు ప్రయత్నించగా, పోలీసుల విచారణలో అశోక్ నిందితుడిగా తేలటంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.
- జూన్ 30వ తేదీన వరంగల్ ఎల్లంబజార్ ప్రాంతానికి చెందిన వీరభద్రాచారిపై బండరాయితో దాడి చేసి పెరుకవాడకు చెందిన టి.రవీందర్ హత్య చేశారు. వ్యక్తిగత కక్షలతో హత్యకు పాల్పడ్డట్లు గుర్తించి, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.
- జూలై 7వ తేదీన నర్సంపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బెల్ట్ షాపు నిర్వాహకుడు షేక్ రహీంపాషా (44)ను మద్యం కోసం హత్య చేశారు.

కూతురిని ప్రేమించాడని..

- వర్ధన్నపేటలో యువకుడిపై హత్యాయత్నం
- అడ్డొచ్చిన మేనల్లుడికి గాయం
- సినిమా థియేటర్‌లో ఘటన
- భయకంపితులైన జనం

వివరాలు : 5లో..

భార్యను దక్కకుండా చేశారని కక్ష

- ప్లాన్ ప్రకారం అత్తమామల హత్య
- 16 చింతల్‌తండా జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్

జిల్లాలో కోటి మొక్కలు నాటాలి

- వనాలను, నీటి వనరులను కాపాడుకోవాలి
- పాలిటెక్నిక్‌ను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తా
- వనమహోత్సవంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి


పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్క నాటిన ఎమ్మెల్యే కడియం, చిత్రంలో ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్ బాషా ఇతర అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 12: జిల్లాలో కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల అవరణలో ఏర్పాటు చేసిన 75వ వన మహోత్సవం కార్యక్రమాన్ని ఎంపీ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ జిల్లాలో 33శాతం అడవులు ఉండాలన్నారు. జనగామ జిల్లాలో కేవలం ఒక్కశాతం అడవులు ఉండడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన మొక్కలు నాటే టార్గెట్ 26లక్షలుగా నిర్ధారించారన్నారు. జిల్లాలో అడవులశాతం పెంచాలంటే ఈ సారి కనీసం కోటి మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రెండేళ్లలో జనగామ జిల్లాను అడవులశాతంలో కనీసం పదో స్థానానికి తీసుకువెళ్లడానికి ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, పాఠశాలలు, గుట్టలు, ఏనెలు, దేవాలయ భూములలో విరివిగా మొక్కలు నాటేలా జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను మొక్కుబడిగా కాకుండా స్థలాలు ఉంటే ఎకరాల కొద్ది విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు వన మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో పాటు ఈజీఎస్ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలో అదనంగా మరి కొన్ని కోర్సులు తీసుకు వచ్చేలా చూస్తానని, నా టర్మ్ పూర్తి అయ్యేలోగా ఘన్‌పూర్ పాలిటెక్నిక్‌ను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తానని హామీ ఇచ్చారు.

రానున్న తరాలకు పచ్చని ప్రకృతిని అందించాలి..

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య

విద్యార్థులు, యవకులు తలా ఐదు మొక్కలు నాటి రానున్న తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మొక్కలు నాటే సంకల్పం ఉంటే అడవులను సైతం సృష్టించవచ్చు అన్నారు. మన రాష్ట్రానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి 70 ఎకరాల భూమిని అడవిగా మార్చాడని గుర్తు చేశారు. జనగామ జిల్లాకు చెందిన రామయ్య అనే వ్యక్తి ఎక్కడికి వెళ్లినా మొక్కలు నాటడం ఆయన వృత్తిగా మార్చుకున్నాడని, ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును అందించిందని అన్నారు. ప్రతీ ఒక్కరు వారిని ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటాలని కోరారు.

కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీఎఫ్‌వో లావణ్య, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఆర్డీవో వెంకన్న, డీపీవో అనిల్‌కుమార్, డీఆర్డీవో మొగులప్ప, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఉమాదేవి, జయంతి, సెక్రటరీ తిరునగరి శ్రీకాంత్, నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాము లు, జూలకుంట్ల శిరీష్‌రెడ్డి, మందపురం ఎల్లాగౌడ్, రాజేష్‌నాయక్, బూర్ల శం కర్, కోతి రాములు, రజాక్‌యాదవ్, కాసాని బొందయ్య, నీల శ్రీధర్, రామకృష్ణ, తోట సత్యం, గుర్రం రాజు, సంపత్‌రాజ్, ఫాతికుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్, జూలై 12: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ వాయసేన అగ్నిపథ్ స్కీం ద్వారా భర్తీ చేసే ఈ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అవివాహిత యువతి, యువకులు అర్హులని, 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 తేది లోపు జన్మించిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోచ్చని సూచించారు.

గురుకులం నుంచి 19 మంది విద్యార్థులు పరార్

సీనియర్లు ఇబ్బందిపెడుతున్నారని మనస్తాపం

పూర్వ పాఠశాలకు చేరుకోగా సర్దిచెప్పి పంపిన ప్రిన్సిపాల్


జ్యోతిబాపూలే విద్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జనగామ కల్చరల్, జూలై 12: జనగామ మండలం పెంబర్తిలో గల జ్యోతిబాపూలే బాలుర పాఠశాల (బచ్చన్నపేటకు చెందినది) నుంచి గురువారం రాత్రి 19 మందఇ విద్యార్థులు గోడదూకి పారిపోయారు. ఈ సంఘటనపై వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామలోని ధర్మకంచ ప్రాంతంలో గల జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో ఏడో తరగతి పూర్తయిన 154 మంది విద్యార్థులను స్థలాభావం కారణంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో పెంబర్తిలోని జ్యోతిబాపూలే బాలుర పాఠశాలకు పంపించారు. అయితే అక్కడి పాఠశాల నచ్చకపోవడం, సీనియర్ విద్యార్థులు ఇబ్బందులకు గురి చేయడంతో మనస్తాపం చెందిన విద్యార్థులు 19 మంది కూడబలుక్కొని ఈ నెల 11న రాత్రి పాఠశాల గోడ దూకి ధర్మకంచ పాఠశాలకు చేరుకున్నారు. దీంతో శుక్రవారం ఉదయం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తల్లిదండ్రులను పిలిపించి విషయాన్ని వివరించారు. కాగా, తమ పిల్లలను ఈ పాఠశాలలోనే ఉంచాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట వారు ఆందోళన చేపట్టారు. రాత్రి వేళ విద్యార్థులు 5కి.మీ నడిచి జనగామకు వచ్చారని, ఈ క్రమంలో ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. దీంతో ప్రిన్సిపాల్ వారికి సర్దిచెప్పి, ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తానని, ప్రస్తుతం విద్యార్థులను తీసుకెళ్లండని చెప్పి తల్లిదండ్రులతో పంపించారు. ఈ విషయమై పెంబర్తి ప్రిన్సిపాల్ చంద్రమౌళిని వివరణ కోరగా జూన్‌లో 154 మంది విద్యార్థులు జనగామ నుంచి వచ్చారని, గొడవలు జరిగే విషయం తనకు తెలియదని అన్నారు. ప్రతీ రోజు నిఘా ఉంటుందని, నైట్ వాచ్‌మెన్ పర్యవేక్షిస్తారని అన్నారు. జరిగిన ఘటనపై విచారణ జరిపిస్తామన్నారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ దుర్మరణం

- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్థుల ఆగ్రహం
- నాలుగు మాసాల వ్యవధిలో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృత్యువాత
- గ్రామస్థుల్లో పెల్లుబికిన ఆగ్రహం.. ఏఈపై దాడి
- ఏడీఈ వాహన అద్దాలు ధ్వంసం
- వనపర్తిలో ఏడుగంటల పాటు ఉద్రిక్తత

లింగాలఘణపురం, జూలై12: లింగాలఘణపురం మండలం వనపర్తిలో విద్యుదాఘాతంతో కుక్కల మల్లేశ్(40) అనే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ దుర్మరణం చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్న మల్లేశ్ విద్యుత్ సిబ్బందికి సహాయకుడిగా వెళ్తుండేవాడు. అయితే శుక్రవారం వనపర్తి నుంచి నేలపోగుల గ్రామానికి వెళ్లే విద్యుత్‌లైన్‌లో సమస్య తలెత్తడంతో జెఎల్ఎం సురేశ్ ఏఈ శంకరయ్య అనుమతితో ఎల్‌సీ తీసుకోగా కాంట్రాక్ట్ ఉద్యోగి విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు పనులు చేపడుతున్నాడు. దీంతో సరిగ్గా అదే సమయానికి అక్కడికి వెళ్లిన మల్లేశ్ విద్యుత్ ఎల్‌సీ తీసుకున్న విషయాన్ని తెల్సుకుని కుక్కల యాదగిరి అనే వ్యక్తి ఇంట్లోకి కరెంట్ సరఫరా కావడం లేదని.. వాటిని సరిచేసేందుకు పోల్ ఎక్కి వైర్లను మరమ్మత్తు చేసే ప్రయత్నం చేశాడు. అయితే దురదృష్టవశాత్తు మల్లేశ్ ఎక్కిన కరెంట్ పోల్‌కు రెండు ఫీడర్లకు చెందిన విద్యుత్ సరఫరా ఉంటుందనే విషయాన్ని మర్చిపోయాడు. దీంతో మల్లేశ్ వైర్లు సరిచేస్తుండగానే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే దుర్మరణం చెంది తీగల మధ్య ఇరుక్కుపోయాడు. అయితే సరిగ్గా నాలుగు మాసాల క్రితం ఇదే గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి అనే కట్టర్ ఇదే తరహా డబుల్ ఫీడర్ సమస్య కారణంగా మృతిచెందగా తాజాగా మల్లేశ్ కూడా ఇదే ప్రమాదంలో చనిపోవడంతో గ్రామస్థు ల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వరుసగా జరిగి న రెండు ప్రమాదాలకు విద్యుత్ అధికారుల నిర్లక్ష్య మే కారణమంటూ అక్కడే ఉన్న ఏఈ శంకర య్యపై దాడికి దిగారు. అంతేకాకుండా ఏడీఈ అనిల్‌కుమార్ వాహన అద్దాలను ధ్వంసం చేశారు. గ్రామంలో అనేక రకాలుగా విద్యుత్ సమస్యలు ఉన్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టిం చుకోవడం లేదని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వరుసగా రెండు నిండు ప్రాణాలు బలయ్యాయని ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల తక్షణ ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేయడంతో విద్యుత్ అధికారులు సొం తంగా రూ. 5 లక్షలు అందజేశారు. మిగతా రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా నెలరోజుల్లో ఇప్పిస్తామని ఒప్పుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సుమారు 7 గంటల పాటు నెలకొన్న ఉద్రిక్తత పరి స్థితులను అదుపులోకి తెచ్చేందుకు ఏసీపీ భీమ్ శర్మ, సీఐ ఎలబోయిన శ్రీని వాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు తీవ్రంగా శ్రమించాయి. ఎట్టకే లకు ప్రమాదానికి గురై మృతిచెందిన మల్లేశ్ మృతదేహాన్ని సాయంత్రం విద్యుత్‌స్తంభం నుంచి కిందకు దించి పోస్టుమార్టంకు తరలించారు. నాలుగు నెలల వ్యవధిలోనే ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెంద డం పట్ల గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. బాధితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


ఏఈ శంకరయ్యపై దాడికి దిగడంతో అడ్డుకుంటున్న పోలీసులు


స్తంభంపైనే మృతిచెందిన మల్లేశ్, మృతుడు మల్లేశ (ఫైల్)

గ్రామంలో పొద్దంతా యుద్ధతావరణం..

మల్లేశ్ మృతిఘటనతో గ్రామస్థులంతా ఒక్కటై పలుమార్లు విద్యుత్ అధికారులపైకి దాడికి యత్నించారు. అప్పటికే ఏఈ శంకరయ్యపై దాడి చేయగా నష్టపరిహారం చెల్లించే విషయంలో ఒక సందర్భంలో చర్చలు విఫలం కాగా ఊరు ఊరంతా ఏఈపైకి దూసుకొచ్చారు. దీంతో పోలీసులు వలయంగా మారి అతి బలవంతంగా గ్రామస్థులను అడ్డుకున్నారు. నష్టపరిహారంతో పాటుగా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. సుమారు ఏడు గంటల పాటు గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనగా సీఐ శ్రీనివాస్ ప్రత్యేక బలగాలను రప్పించారు. సుమారు 300 మంది గ్రామస్థులు ఒకవైపు.. పోలీసుబలగాలు మరోవైపు క్షణక్షణం ఉద్రిక్తత పరిస్థితులతో వనపర్తిలో పొద్దంతా యుద్ధవాతావరణం నెలకొంది.

కలెక్టరేట్ ముట్టడికి ఎస్ఎఫ్ఐ యత్నం

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్


కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

జనగామ రూరల్, జూలై 12: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ఆధ్యక్షుడు బడికే సందీప్ ఆధ్వర్యంలో విద్యార్థులు జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం, ఎస్సీఎస్టీ, బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమిస్తాం: ఏబీవీపీ

జనగామ కల్చరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల, విద్య పట్ల కనీస ధ్యాస కనబడడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కనీసం ఒక్కసారి కూడా విద్య పట్ల మాట్లాడింది లేదన్నారు. కొన్ని సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సర్టిఫికెట్లు తీసుకోలేక, పై చదువులకు వెళ్లలేక మధ్యలోనే విద్యను ఆపేయాల్సిన పరిస్థితులు చూస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.7 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుంటుపల్లి కార్తీక్, దేవులపల్లి నితీష్, గణేష్, సాయిరోహిత్ పాల్గొన్నారు.

ఆటోలను దొంగలించిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు


ఇద్దరు వ్యక్తుల అరెస్టును చూపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, జూలై 12: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హంటర్‌రోడ్డులోని పద్మాక్షీ గుట్ట ఏరియా ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆటోలను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని శుక్రవారం అరెస్టు చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం, మట్కాక్టివ్ జిల్లా, ఉప్పల్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన రమేష్ పట్నాయక్(40), అతడి స్నేహితుడైన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి చెందిన వేములు సంతోష్(42)లు జల్సాలకు అలవాటుపడ్డాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో దొంగతనాలకు అలవాటుపడి పార్కింగ్ చేసిన ఆటోలను దొంగిలించడం వృత్తిగా ఎంచుకున్నట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువ చేసే మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇద్దరు దొంగలను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

రాధక్క సంతాప సభను జయప్రదం చేయాలి

కాళోజీ జంక్షన్, జూలై 12: గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నాయకురాలు రాధక్క సంతాప సభను జయప్రదం చేయాల్సిందిగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కోరారు. సంతాప సభను పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు సమీపంలోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంతాపసభకు సంబంధించిన పోస్టర్లను హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో ఆవిష్కరించారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవర్దన్, ప్రగతి శీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పార్టీ ఖమ్మం, వరంగల్ ఏరియా కమిటీ మోకాళ్ల మురళీకృష్ణ, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పాల్గొంటున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు తెలిపారు.


హనుమకొండ కాళోజీ సెంటర్‌లో సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యూ డెమోక్రసీ నాయకులు

హనుమకొండలో ట్రాఫిక్ మళ్లింపు

హనుమకొండ కలెక్టరేట్, జూలై12: హనుమకొండలోని అశోకా జంక్షన్ నుంచి హనుమకొండ బస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతులు నిర్వహించేందుకు వరంగల్ గ్రేటర్ మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఈ నెల 14వ తేదీ (ఆదివారం) ఉదయం వరకు ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఈ మార్గాన్ని తాత్కాలికంగా మూసివేస్తామని తెలిపారు. బస్‌స్టేషన్‌కు వెళ్లాలనుకున్న వాహనదారులు ఏషియన్ మాల్, బాలసముద్రం, హనుమకొండ చౌరస్తా నుంచి బాలాంజనేయ దేవాలయం మీదుగా చేరుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంజేపీ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 12: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఆర్‌సీవో వై. మనోహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను నేరుగా సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్(9866610429), ములుగు (9989991703), మహబూబాబాద్ (7093003078), పాలకుర్తి (9989418015), భూపాలపల్లి (9154102635) తదితర కళాశాలల్లో అర్హతలను బట్టి వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు.

రైల్వేల అభివృద్ధి నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

కాజీపేట, జూలై 12: కాజీపేటలో రైల్వే పరిశ్రమల అభివృద్ధి, రైల్వే కార్మికుల సంక్షేమంపై శనివారం కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ కడియం కావ్యతో పాటు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులు హాజరుకానున్నారని చెప్పారు. సాయంత్రం 4గంటలు జరిగే ఈ సమావేశానికి రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు, లోకో పైలెట్‌లు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఇతర సంఘాలు పాల్గొని రైల్వే సమస్యలపై చర్చించాలని రాఘవేందర్ కోరారు.

మక్కలకు రికార్డు ధర

క్వింటాకు రూ. 2,645

మట్టెవాడ, జూలై 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వరంగల్‌లో శుక్రవారం మొక్కజొన్నలకు రికార్డు ధర పలికింది. మొక్కజొన్నలకు క్వింటాల్‌కు రూ.2,645 ధర పలికింది. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చరిత్రలోనే మొక్కజొన్నలకు ఇంత ధర పలకడం ఇదే తొలిసారి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల కిందట మొక్కజొన్నలు మార్కెట్‌లో రూ.2,400 ధర పలికింది. అది క్రమంగా పెరుగుతూ శుక్రవారం రూ. 2,645కు ఎగబాకింది.

కూతురిని ప్రేమించాడని..

వర్ధన్నపేటలో యువకుడిపై హత్యాయత్నం ● అడ్డొచ్చిన మేనల్లుడికి గాయం ● సినిమా థియేటర్‌లో ఘటన



వర్ధన్నపేట థియేటర్‌లో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్య ప్రకాష్

వర్ధన్నపేట రూరల్/ వర్ధన్నపేట, జూలై 12 : భారతీయుడు - 2 సినిమా రిలీజ్ సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని భారతీయ టాకీస్‌లో సాయంత్రం 6 గంటలకు ఫస్ట్ షో పడింది. సినిమా ప్రారంభమై పది నిమిషాలు కాగానే ఒక్కసారిగా హాహాకారాలు వినిపించాయి. దీంతో థియేటర్‌లో ఉన్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెనకకు చూస్తే కత్తితో ఓ యువకుడిని పొడుస్తున్న దృశ్యం. దీంతో అందరూ ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టారు. ఏం జరిగిందో తెలుసుకునే సరికి దాడిచేసిన వ్యక్తి కత్తిని అక్కడే వదిలేసి పారిపోయాడు. వర్ధన్నపేట పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని ఇల్లందలో శుక్రవారం కుటుంబసభ్యులు వన భోజనాలకు వెళ్లారు. అక్కడే భోజనాలు చేసి మద్యం సేవించి సాయంకాలం భారతీయుడు-2 సినిమా చూసేందుకు దాదాపు 8మంది వర్ధన్నపేటకు వచ్చారు. థియేటర్‌లో విజయ్ ముందు సీట్లో కూర్చోగా, కృష్ణ అతడి వెనకాలే కూర్చున్నాడు. అప్పటికే కృష్ణ తన వెంట తెచ్చుకున్న కత్తితో సినిమా పడిన 10నిమిషాలకు విజయ్‌ను వెనక నుంచి మూడుసార్లు పొడిచారు. అరుస్తూ వెనక్కి తిరగ్గా పొట్టలో మరోసారి పొడిచి, కత్తి అక్కడే పడేసి బయటకు వెళ్లిపోయాడు. దాడి సమయంలో అడ్డుపడిన కృష్ణ అక్క కుమారుడు గంధం రాజ్‌కుమార్‌కు సైతం కత్తి పోటు పడింది. విజయ్‌తో వచ్చిన వాళ్లు వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరం గల్ ఎంజీఎంకు తరలించారు.

ప్రేమ వ్యవహారమే కారణమా?

ఇల్లందకు చెందిన ఊర కృష్ణ ఓల్డ్ ఐరన్ (పాత ఇనుమ సామగ్రి) షాపు నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన సోదరుడు ఊర రాజ్ కుమార్ సైతం వర్ధన్నపేట పట్టణంలో ఓల్డ్ ఐరన్ షాపు వ్యాపారం చేస్తున్నాడు. రాజ్‌కుమార్ వద్ద మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని అమ్మాపురంనకు చెందిన యువకుడు కల్లెం విజయ్ పనిలో చేరాడు. విజయ్ ఇల్లందలోనే ఉంటూ షాపును చూసుకుంటున్నాడు. కొన్ని నెలల కిందట కృష్ణ కూతురిని ప్రేమించిన విషయంలో విజయ్‌తో గొడవలు జరగగా, వారి సామాజిక వర్గంలో(బుడగ జంగాలు) పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకున్నారు. విజయ్‌దే తప్పని తేల్చి అతడికి దాదాపు రూ.50వేల వరకు జరిమానా విధించారు. దీంతో గొడవ సద్దుమణిగింది. విజయ్ కూడా తనపని తీను యథావిధిగా చేసుకుంటున్నాడు. కానీ తన కూతురుని ప్రేమించిన విషయాన్ని కృష్ణ మనసులో పెట్టుకుని కక్ష పెంచుకున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో శుక్రవారం కృష్ణ కుటుంబంతో పాటు సోదరుడు రాజ్‌కుమార్ కుటుంబం కూడా వనభోజనానికి వచ్చింది. వారితోపాటే కల్లెం విజయ్ కూడా వచ్చాడు. సాయంత్రం అంతాకలిసి సినిమాకు ప్లాన్ చేసుకున్నారు. ఇదే అదునుగా భావించిన కృష్ణ.. వారితోపాటే సినిమాకు వస్తూ వెంట కత్తిని తెచ్చుకున్నాడు. థియేటర్‌లో విజయ్ వెనకాలే కూర్చొని కత్తితో దాడి చేశాడు.

సమాచారం అందుకున్న వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్య ప్రకాష్‌లు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడి జరిగిన పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో మొబైల్, దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వర్ధన్నపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంధం రాజ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. గాయాలైన కుటుంబసభ్యులు ఫిర్యాదు అందిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.


నిందితుడు కృష్ణ (ఫైల్)


బాధితుడు విజయ్ (ఫైల్)


చికిత్స పొందుతున్న గంధం రాజ్‌కుమార్

నేటి నుంచి ప్యాసింజర్ ప్రారంభం

డోర్నకల్, జూలై 12: విజయవాడ - డోర్నకల్ - భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్ - డోర్నకల్ - విజయవాడ స్టేషన్ల మధ్య నడిచే (07979/07278) ప్యాసింజర్ రైలును శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసినట్లు డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనూపాష తెలిపారు. గతనెల 27న దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన సమయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. దీంతో స్పందించిన డీఆర్ఎం రైలు పునరుద్దరణకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మైనూపాషా రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

భార్యను దక్కకుండా చేశారని కక్ష

- ప్లాన్ ప్రకారం అత్తమామల హత్య
- 16 చింతల్‌తండా జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్


నిందితుడు నాగరాజు (ఫైల్)

నర్సంపేట టౌన్, జూలై 12: ప్రేమించి పెళ్లి చేసుకుంటే అత్తమామలు భార్యను తనకు కాకుండా చేశారనే కక్షకట్టి అత్తమామలపై నిందితుడు నాగరాజు దాడి చేసి హత్య చేసినట్టు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీసులు అరెస్టు చేయగా, వరంగల్ డీసీపీ విలేకరుల సమావేశంలో ఘటన వివరాలను వెల్లడించారు.

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మేకల నాగరాజు అలియాస్ బన్నీకి చెన్నారావుపేట మండలం 16 చింతల్‌తండాకు చెందిన బానోతు దీపిక స్కూల్‌కు వెళ్లే సందర్భంలో (ఐదేళ్ల కిందట) పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. 2023 అక్టోబరులో నాగరాజు, దీపికలు హైదరాబాద్‌కు వెళ్లి నవంబరులో జగదిగిరిగుట్ట వద్ద వివాహం చేసుకున్నారు. ఈ విషయంపై దీపిక తల్లిదండ్రులు హనుమకొండలోని సుబేదారిలో పోలీస్ స్టేషనలో అదేరోజు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు వారిద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పుడు దీపిక నాగరాజుతో పాటు వెళ్లింది. కొంతకాలం హైదరాబాద్‌లో ఉండగా, ఇటీవల భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు జరగగా, నాగరాజుతో ఉండలేనని దీపిక తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. అప్పటి నుంచి దీపిక పుట్టింట్లోనే ఉంటోంది. అయితే తన భార్యను తన వద్దకు రాకపోగా, ఆమె తల్లిదండ్రులు తమను వేరు చేస్తున్నారన్న కక్షను పెంచుకున్న నాగరాజు.. వారిని ఎలాగైనా చంపాలని భావించాడు. హైదరాబాద్ నుంచి 5నెలల కిందట గుండెంగకు చేరుకొని ఆటో కిరాయి తీసుకొని నడుపుకుంటున్నాడు. నెల కిందట నెక్కొండలో అంబేద్కర్ సెంటర్ వద్ద కత్తులు అమ్ముతున్న వ్యక్తి వద్ద పదునైన పొడవాటి కత్తిని కొనుగోలు చేశాడు. 16 చింతల్‌తండాకు రెండు, మూడు పర్యాయాలు వెళ్లి దీపిక ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు.

ఈనెల 11న రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో నాగరాజు తన తాత వద్ద టీవీఎస్ ఎక్సెల్ వాహనం తీసుకొని 16 చింతల్‌తండాకు చేరుకున్నాడు. దీపిక ఇంటి వద్దకు చేరుకున్న నాగరాజు.. ఇంటి బయట రేకులషెడ్డు కింద రెండు మంచాలలో నిద్రపోతున్న దీపిక, దీపిక తల్లి బానోతు సుగుణ, తండ్రి శ్రీనులపై తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఇంట్లో నిద్రిస్తున్న దీపిక తమ్ముడు మదన్‌లాల్ మెడపై కత్తితో వేటు వేశాడు. ఈ దాడిలో సుగుణ అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీను నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చనిపోయాడు. భయంతో మదన్‌లాల్, దీపికలు పారిపోయారు. ఇంతలో చుట్టుపక్కలవారు రావడంతో నాగరాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయంపై మృతుడు శ్రీను తల్లి ఈరమ్మ చేసిన ఫిర్యాదుతో నిందితుడు మేకల నాగరాజు అలియాస్ బన్నీపై కేసు నమోదు చేశారు. ఈనెల 11న నెక్కొండ సీఐ సిబ్బందితో హనుమకొండలోని వడ్డెపల్లి జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, నెక్కొండ సీఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌ను అందుబాటులో ఉంచాలి..



ఫోర్టిఫైడ్ రైస్ తయారీ విధానంపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల ప్రతినిధులు

కాళోజీ జంక్షన్, జూలై 12: ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ సంపూర్ణ పౌష్టికాహారం అందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ విధానంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతోపాటు పౌర సరఫరాల శాఖలో సమన్వయ లోపం వల్ల నాసిరకం బియ్యం పంపిణీ జరుగుతోందని దామోదర్ అన్నారు. ప్రభుత్వ చౌక డిపోలు, ప్రభుత్వ బియ్యం గోదాముల ద్వారా వినియోగదారులకు ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా అవుతున్న క్రమంలో అవాంతరాల వల్ల ఆహార కల్తీ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ రైస్ విధానంపై రాష్ట్రవ్యాప్తంగా ఆహార సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహార కల్తీ నిరోధక శాఖ ఫోర్టిఫైడ్ రైస్ లైసెన్స్ జారీ వరకే పరిమితం కాకుండా నిరంతర నిఘా పెట్టాలని అన్నారు. సమావేశంలో ఫోర్టిఫైడ్ రైస్ తయారీపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇంకా నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమసమితి ప్రతినిధులు పెండోట అనిల్‌కుమార్, నందు ప్రవీణ్, గైనీ రత్నాకర్, వినియోగదారుల మండలి ప్రతినిధులు రావుల రంజిత్‌కుమార్, ఎర్ర అశోక్‌కుమార్, కల్యాణపు శ్యాంసుందర్ పాల్గొని మాట్లాడారు.

మంత్రి సురేఖను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం

బాలసముద్రం, జూలై 12: రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను ఆర్టీసీ ఆర్ఎం విజయభాను శుక్రవారం హనుమకొండలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్ బస్టాండ్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరినట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వరంగల్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కె.భానుకిరణ్, హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్‌లు ఉన్నారు.


మంత్రి సురేఖకు పుష్పగుచ్ఛం అందిజేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

పీడీఎస్ బియ్యం, గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, జూలై 12: పరకాల ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. దాడుల్లో రూ.8లక్షల 26వేల పీడీఎస్ బియ్యం, రూ.1లక్ష 58వేల గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం నిల్వలున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పరకాలలో దాడులు చేశారు. పోలీసుల దాడుల్లో బండి కుమార్ వద్ద రూ.2లక్షల 80వేల బియ్యం, బండి శంకర్ వద్ద రూ.2లక్షల 8వేల బియ్యం, టి.ఐలయ్య వద్ద రూ.3లక్షల 38వేల బియ్యంతోపాటు ఆర్.చంద్రశేఖర్ వద్ద రూ.1లక్ష 58వేల గుట్కాలను స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం స్థానిక పోలీసులు నలుగురిని అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ నిస్సార్‌పాషా, ఏఎస్సై పీవీరావు, కానిస్టేబుళ్లు కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు


చెత్తలో ఉన్న అధికారుల చిత్రపటాలు

చాంబర్‌కు వాస్తు దోషం!

ఎంజీఎంలో అధికారుల ఆఫీసుల మార్పు

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

చెత్త బుట్టలోకి పాత సూపరింటెండెంట్ల చిత్రపటాలు

వరంగల్ మెడికల్, జూలై 12: ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్‌కు వాస్తు దోషం పట్టుకుంది. దీంతో సూపరిం టెండెంట్ పలు కార్యాలయాల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఏకంగా రూ.50లక్షల ప్రజాధనంతో నూతన హంగులతో చాంబర్ ఏర్పాటు చేసుకున్నారు. పాత చాంబర్ బాగానే ఉన్నప్పటికీ వాస్తు పేరుతో డెర్మటాలజీ విభాగంలో ఓపీ విభాగం మరో చోటికి మార్చి మరీ చాంబర్ ఏర్పరుచుకున్నారు. అదే విధంగా ఆర్ఎంవో గదులను కూడా నూతనంగా ఏర్పాటు చేశారు. దీంతో పరిపాలన కార్యాలయాన్ని మరోచోట, వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు మరోచోట ఉండటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే సెక్షన్లు ఒకచోట.. అధికారులు మరో చోట ఉండటంతో అధికారుల సంతకాల కోసం అక్కడిదాకా వెళ్లాల్సి వస్తోంది. ఎంజీఎంలో కనీస వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతుంటే.. ఉన్నతాధికారి మాత్రం ఇన్ని హంగులతో చాంబర్ ఏర్పాటు చేసుకోవడం అవసరమా..? అని రోగులు ప్రశ్నిస్తున్నారు.

చెత్త కుప్పలో చిత్రపటాలు

ఎంజీఎం ఆస్పత్రిలో పాత సూపరింటెండెంట్‌లకు అవమానం జరిగింది. వారి చిత్రపటాలను చెత్తబుట్టలో పడేశారు. ఎంజీఎం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైద్యాధికారుల చిత్రపటాలను అలా పడేయడంపై సిబ్బంది, రోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు పనిచేసిన సూపరింటెండెంట్ల ఫొటోలను సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏర్పాటు చేసే ఆనవాయితీ ఉంది. అయితే చాంబర్ ఆధునీకరణ పేరుతో ఈ ఫొటోలను అన్నింటినీ చెత్తబుట్టలో వేశారు. ఎవరు, ఎంతకాలం పనిచేశారనే బోర్డులను కూడా తొలగించారు. ఎంజీఎంకు అమూల్యమైన సేవలు అందించిన ఉన్నతాధికారుల ఫొటోల పట్ల నిర్లక్ష్యం తగదని ఆ శాఖ ఉద్యోగులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆ చిత్రపటాలను చాంబర్‌లో ఏర్పాటు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


హనుమకొండ చౌరస్తాలో ఏర్పడ్డ గుంతలు


వడ్డెపల్లి జంక్షన్ వద్ద 'వావ్ వరంగల్' లోగో ఎదుట ఏర్పడ్డ గుంతలు


హనుమకొండ బాలసముద్రం ఏకశిలా పార్కు వద్ద..


హనుమకొండ బస్‌స్టాండ్ వద్ద గుంతలు

గుంతల దారులు.. నగరవాసుల అవస్థలు..


కాజీపేట జంక్షన్‌లో అస్తవ్యస్తంగా..


ములుగురోడ్ జంక్షన్‌లో ఏర్పడ్డ గుంతలు

నగరం ఓ వైపు స్మార్ట్ సిటీగా అడుగులు వేస్తున్న సమయంలో నగర వాసులను గుంతలమయమైన రహదారులు అవస్థల పాలు చేస్తున్నాయి. వరంగల్ నుంచి కాజీపేట వరకు రోడ్లన్నీ అడుగుకో గుంతతో అధ్వానంగా, ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా జంక్షన్లలో ఏర్పడిన గుంతలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అసలే గుంతల రోడ్లపై ప్రయాణంగా కష్టంగా ఉందనుకుంటుంటే.. వర్షాలకు వాటిలో నీరు నిలిచి ఎక్కడ ఏ గతుకు ఉందో అర్థం కాక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, రూ.కోట్లలో నిధులు వెచ్చిస్తున్నామని చెబుతున్న పాలకులు, అధికారులకు తమ కష్టాలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

\- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

అధికారులు అందుబాటులో ఉండాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



కొత్తగూడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జూలై 12: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని, అధికారులు అంకితభావంతో ప్రజలకు అందుబాటులో ఉండి, సేవచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖల పరిధిలో చేపట్టిన చేపట్టబోయే పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్లు, భవనాల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అయినా స్పందించకుంటే పనులను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు రెండుకు మించి పనులను కేటాయించవద్దన్నారు. రోడ్లను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులు సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో వైద్యం అందించాలన్నారు. కొత్తగూడ, గంగారం మండలాలు పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలు అని అన్నారు. అధికారులు ఈ మండలాలపై దృష్టి సారించి, అభివృద్ధి చేయాలని సూచించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఓలింపియార్డ్ టెస్టులో 'సెయింట్ పాల్స్' ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్

జనగామ కల్చరల్, జూలై 12: జాతీయస్థాయిలో నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఓలింపియార్డ్ టెస్టులో స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. గత సంవత్సరం నిర్వహించిన గణితశాస్త్రం, సైన్స్, ఇంగ్లీషు, సాంఘిక శాస్త్రం, డ్రాయింగ్ విభాగాలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో గణిత విభాగంలో 27 మెడల్స్, సైన్స్ విభాగంలో 25, ఇంగ్లీషు విభాగంలో 22, సాంఘిక శాస్త్ర విభాగంలో 17 మొత్తం 91 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో ఎక్సలెంట్ అవార్డ్సను గణిత విభాగంలో ముగ్గురు, ఇంగ్లీషు విభాగంలో ఐదుగురు, సైన్స్ విభాగంలో ఇద్దరు, డ్రాయింగ్ విభాగంలో ఒక్కరు, సాంఘిక శాస్త్ర విభాగంలో ఇద్దరు మెడల్స్ సాధించారు. రాష్ట్రస్థాయి టాపర్స్‌గా గణిత విభాగంలో ఒక్కరు, ఇంగ్లీషు విభాగంలో ఇద్దరు, సైన్స్ విభాగంలో ముగ్గురు, మొత్తం ఆరుగురు విద్యార్థులు సాధించారు. వారికి నగదు బహుమతితో పాటు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయులు ఎస్.మరియ జోసెఫ్ శుక్రవారం అందజేశారు. అదేవిధంగా జాతీయస్థాయిలో వరుసగా రెండోసారి గోల్డెన్ స్కూల్ అవార్డ్, బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు, ముగ్గురు ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా విజయానికి కారకులైన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

బచ్చన్నపేట, జూలై 12: మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామ శివారు జయాలకు చెందిన గిద్దెల గణేష్ (22) అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన గిద్దెల మేషమాల-బాలయ్య దంపతులకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లున్నారు. కొడుకు గణేశ్ చేర్యాలలో ఇంటర్ చేయగా పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో సప్లిమెంటరీ రాయగా, మళ్లీ సబ్జెక్టులు తప్పటంతో కొంత కాలంగా మానసిక వేదనతో ముభావంగా ఉంటున్నాడు. ప్రస్తుతం స్థానిక పాలకేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటినుంచి వెళ్లి గ్రామానికి కొద్దిదూరంలోని ఏనె వద్ద చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడు. తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిరహిత పాలన అందించడమే లక్ష్యం

వెంకన్న ఆలయ అభివృద్ధి, రహదారుల నిర్మాణానికి రూ.100 కోట్లు

ఏడాదిలోగా మండల కాంప్లెక్స్ నిర్మాణం, ఎత్తిపోతల పనులు పూర్తి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి - ఎంపీ కావ్యతో కలిసి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ డాక్టర్ కావ్య

చిలుపూర్, జూలై 12 : అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా తాను పని చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం చిలుపూర్ గుట్టలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్యతో కలిసి ఆయన హాజరయ్యారు. 74 మందికి కల్యాణలక్ష్మి, 26 మందికి రూ.7.27లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. చిలుపూర్ గుట్ట అంగడి ప్రదేశంలో డ్రెయినేజీ లోపం కారణంగా పేరుకుపోయిన బురదనీటిని పరిశీలించారు. నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడ్డ చిలుపూర్ మండలంలో మండల కాంప్లెక్స్ నిర్మాణం, రూ.100 కోట్లతో పల్లగుట్ట నుంచి కృష్ణాజీగూడెం, ఫతేపూర్, గార్లగడ్డ మీదుగా మల్లన్నగండి రిజర్వాయర్ వరకు బీటీ డబుల్ రోడ్డు, వెంకటేశ్వర్లపల్లి నుంచి చిలుపూర్ మీదుగా వెంకటాద్రిపేట వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చర్యలు, వెంకన్న ఆలయ అభివృద్ధికి చర్యలు, రూ.104 కోట్లతో వచ్చే ఖరీఫ్‌లోగా కొండాపూర్, శ్రీపతిపల్లి, లింగంపల్లి గ్రామాలకు సాగునీరందిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా కొమ్ముగుట్ట క్రాస్‌రోడ్ నుంచి లింగంపల్లి, శ్రీపతిపల్లి మీదుగా ఏన్యానాయక్ తండా వరకు చేపట్టే బీటీ డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని, రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధిలో తన తండ్రి కడియంతో పాటు, తన పాత్ర కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న, ప్రత్యేక అధికారి గుగ్రం విజయ్‌కుమార్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ విక్రమ్, ఇన్‌చార్జి తహసీల్దార్ విమల, ఎమ్మార్వై కలువల శ్రీనివాస్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్లు పొట్లపల్లి శ్రీధర్‌రావు, మామిడాల యాదవరెడ్డి, మూల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, గజ్జెల దామోదర్, మామిడాల లింగారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, రంగు రమేష్, ఎమ్డీ షకీల్, తాళ్లపల్లి సమ్మయ్య, సంపత్‌కుమార్, గడ్డమీది వెంకటస్వామి, పంతం రాజుగౌడ్, జక్కుల రాజయ్య, మారపాక ఇస్సాక్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు సన్మానం..

ఎంపీ కడియం కావ్యతో పాటు, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చిన్నపెండ్యాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు, చిలుపూర్ ఆలయ మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్ నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందుకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఎన్‌హెచ్‌పై ఫుట్ ఓవర్ బ్రిడ్జీ (ఎఫ్‌వోబీ)ని మంజూరు చేయించడంతో పాటు, ట్రాఫిక్ సమస్య నివారణకు బస్టాండ్ చౌరస్తా వద్ద బుగులు వెంకన్న ఆలయ ఆర్చిని తొలగించి, మరోచోట నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మామిడాల లింగారెడ్డి, తాళ్లపల్లి సంపత్‌కుమార్, మామిడాల యాదవరెడ్డి, గడ్డమీది వెంకటస్వామి, ఇల్లందుల యాదగిరి, తాళ్లపల్లి బుచ్చయ్య, పేరాల నాగభూషణం పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందిస్తున్న గోపగోని శ్రీధర్‌గౌడ్

నర్మెట, జూలై 12 : మండలకేంద్రంలో పురాతన కాలం నాటి శివాలయం శిథిలావస్థకు చేరగా ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టి ఆలయానికి కాశీ విశ్వనాథ శివాలయం అని నామకరణం చేశారు. అభివృద్ధి కోసం దాతల సహాయం తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నర్మెట గ్రామానికి చెందిన గోపగోని శ్రీధర్‌గౌడ్ రూ. 1,00,116 విరాళం అందించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు జంగిటి అంజయ్యలకు అందించారు. ఈసందర్భంగా శ్రీధర్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్ఞాపురం శ్రీధర్, కొండం బాలయ్య, ముక్కెర రాజేష్, పల్లె ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జనగామ రూరల్, జూలై 12: జిల్లా కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ ఓల్డ్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ, జనగామ న్యూ సబ్‌స్టేషన్, కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా జిల్లా కేంద్రంలోని అన్ని ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

గొర్రెలను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

లింగాలఘణపురం, జూలై12: మండలంలోని నవాబుపేట వద్ద జనగామ సూర్యాపేట జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. జనగామ నుంచి చిన్నమడూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు అనూహ్యంగా గొర్రెలు అడ్డం వచ్చాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పక్కకు తప్పించే ప్రయత్నం చేయగా అప్పటికే ఒక గొర్రె మృత్యువాత పడింది. అయితే బస్సును పక్కకు తప్పించే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైపునకు దూసుకెళ్లి కొద్దిదూరంలో బస్సు ఆగిపోగా ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, జూలై 12: మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య (55) హన్మకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. లక్ష్మయ్య కొంత భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం అప్పు చేశాడు. దాంతో పాటు తన కూతురు వివాహానికి మరికొంత అప్పు చేశాడు. అవి తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది ఈ నెల 9న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హన్మకొండకు తరలించగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందతూ మృతి చెందాడు. కుమారుడు రాకేష్ ఫిర్యాదు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కొడకండ్ల, జూలై 12 : మండలంలోని మైదం చెరువు తండాకు చెందిన ధరావత్ పీన్యానాయక్ అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలిసిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు వారింటికి వెళ్ళి పీన్యానాయక్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దు, భాస్కర్, రవి, హేమానీ, ఉపేందర్, కిషన్, భిక్షపతి, రాంకిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీల విజేతలను అభినందించిన డీఈవో



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డీఈవో తదితరులు

జనగామ కల్చరల్, జూలై 12: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన పోస్టర్ మేకింగ్ పోటీలలో విజేతలను డీఈవో అభినందించారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జిల్లాస్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించగా శుక్రవారం డీఈవో కె.రాము ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి నగదు బహుమతులతో పాటు సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ పోటీలలో చాగల్లు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.వర్షిణి ప్రథమ స్థానం, నర్మెట మోడల్ స్కూల్ విద్యార్థిని ఎన్.సంకీర్తన ద్వితీయ, తరిగొప్పుల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వినిత తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న అంతర్గత నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమ పర్యవేక్షకుడిగా వ్యవహరించిన అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణ గల గుణాత్మక విద్యతో పాటు వారి సమగ్ర మానసిక అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలను నిర్వహించడానికి ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్ర శిక్షణ అభియాన్ కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జీసీడీవో గౌసియాబేగం, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, డ్రాయింగ్ మాస్టర్ హష్మతుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, సంగీతమాధురి, అశోక్, నాగరాజు, నవీన్, అనిల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అదేవిధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 8,9 తరగతి విద్యార్థులకు జాతీయ హరిత దళం (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో పోస్టర్ మేకింగ్, కవితల పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోస్టర్ మేకింగ్‌లో బి.కీర్తి (సెయింట్ మేరీస్ హైస్కూల్, జనగామ) ప్రథమ, గణేష్ (మోడల్ స్కూల్, లింగాలఘణపురం) ద్వితీయ, బి.శ్రావణి (ఉన్నత పాఠశాల, పెంబర్తి) తృతీయ స్థానంలో నిలవగా, కవితా రచనల పోటీలలో ఆర్.అభినేత్రి (కేజీబీవీ, బచ్చన్నపేట) ప్రథమ, టి.తేజస్విని (సెయింట్ మేరీస్ హైస్కూల్, జనగామ) ద్వితీయ, కె.సిరి (ఏకశిల హైస్కూల్, జనగామ) తృతీయ స్థానంలో నిలవగా సుష్మా (కేజీబీవీ, జాఫర్‌గఢ్) ప్రత్యేక బహుమతులను పొందారు. బహుమతి ప్రదానోత్సవ సమావేశానికి డీఈవో కె.రాము ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి పర్యావరణం పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు ఇందుకోసం పాఠశాలలో సరైన అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విజేతలకు మెమెంటోలు, సర్టిఫికేట్లు అందించారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ గౌసియాబేగం, ఏఎంవో శ్రీనివాస్, కార్యక్రమ ఇన్‌చార్జిగా హెచ్‌ఎం మల్లికార్జున్ వ్యవహరించారు.

రక్తచరిత్ర

(3వ పేజీ తరువాయి)

ముగ్గురు పిల్లలను అనాథలుగా చేసిందనే చర్చ జరుగుతోంది.

భూవివాదంలో..

జూలై 1వ తేదీ రాత్రి రాయపర్తి మండలం బురహాన్‌పల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్‌పై అదే గ్రామానికి చెందిన పల్లె మల్లేష్, అతడి అనుచరులు భూతగాదాలతో దాడికి పాల్పడ్డారు. మూడు ఎకరాల భూమి విషయంలో వివాదం ఉండటంతో సుత్తెతో తలపై బాదటంతో అక్కడిక్కడే దేవేందర్ మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. ప్రస్తుతం నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

పోలీసుల నజర్..

వరుసగా జరుగుతున్న హత్యలు, దాడులపై పోలీసులు నజర్ వేస్తున్నారు. నేరాలను అరికట్టేందుకు పోలీసులు నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయటం, అదుపులోకి తీసుకోవటం చేస్తున్నారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా స్వయంగా అర్ధరాత్రి కూడా నగరంలోని పలు పోలీస్‌స్టేషన్‌లను తనిఖీలు చేస్తూ పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు. అయినప్పటికీ హత్యలు, దాడులకు బ్రేక్ పడటం లేదు. ముఖ్యంగా నగరంలోని మిల్స్ కాలనీ ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ లభిస్తుందనే ప్రచారం జరుగుతోంది. నేరాలకు ఇవి కూడా ప్రధానం కావటంతో పోలీసులు వీటిపై కూడా దృష్టి పెట్టాలని, రాత్రిళ్లు పోలీసు పెట్రోలింగ్‌లను పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రేమోన్మాది నాగరాజును శిక్షించాలి

గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేశ్‌నాయక్

జఫర్‌గడ్, జూలై 12 : చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో గిరిజన దంపతులను అతి దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది నాగరాజును కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి జువారి రమేశ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ నాగరాజు ప్రేమ పేరుతో దీపిక అనే గిరిజన అమ్మాయిని మోసం చేసి.. లొంగకుంటే అమ్మాయి తల్లిదండ్రులైన శ్రీనివాస్-సుగుణ దంపతులపై వేట కొడవళ్లతో నరికి చంపడం అమానుషమన్నారు. సమాజంలో నానాటికి యువతులు, మహిళలు, గిరిజనులపై వేధింపులు, హింసాత్మక దాడులు, హత్యా ఘటనలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. తల్లిదండ్రులను హత్య చేసి పిల్లలను అనాథలను చేసిన దుండగుడిని ఉరి తీయాలన్నారు. ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

14న ఉచిత మెగా వైద్యశిబిరం

జనగామ కల్చరల్, జూలై 12: లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 14న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రీజియన్ చైర్మన్లు చందుపట్ల రవీందర్‌రెడ్డి, కలువల భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు ఎముకలు, కీళ్లు, కిడ్నీ, ఊపిరితిత్తులు, నరాలు, చిన్నపిల్లల వ్యాధులు, స్త్రీల సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, నేత్ర సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారని అన్నారు. హాజరైన ప్రతీ ఒక్కరికి బీపీ, షుగర్ పరీక్షలు అనివార్యంగా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానుండగా లయన్స్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. వివరాలకు 94416 97938 నంబరులో సంప్రదించాలన్నారు.

సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 12: ప్రభుత్వ పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నమిలిగొండ, పాంనూర్, ఛాగల్, మీదికొండ, తాటికొండ, రాఘవపూర్, కొత్తపల్లి గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి నూతన సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులను, పరిసరాలను శుభ్రం చేసే సిబ్బంది లేరని, ప్రభుత్వం వెంటనే ప్రతీ పాఠశాలలో సర్వీసు సిబ్బందిని నియమించి పాఠశాలల బాగుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే డైట్, ఎస్‌సీటీఈ కళాశాలల్లో 100శాతం పోస్టులు ఖాళీగా ఉండడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలలకు అనుబంధంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్, టి. నీలకంఠం, రవి, సలావుద్దీన్, రాము, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారు పాఠశాల సమస్యలు చూడండి

పాలకుర్తి, జూలై 12: నియోజకవర్గ కేందంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే స్పందించి తగు ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో పెనుగొండ సోమేశ్వర్, బోనగిరి శ్రీను, వెంకన్న, వేల్పుల దేవరాజ్, ఈర్ల రాజు, గోనె అమరేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

సీపీఐ మండల కార్యదర్శి పైస రాములు

చిలుపూర్, జూలై 12 : మండలంలోని శ్రీపతిపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 70లో ఉన్న 46.21 ఎకరాల ప్రభుత్వ భూమిని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి పైస రాములు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ విమలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, శ్రీపతిపల్లిలో ఉన్న ప్రభుత్వ భూములను అర్హులైన నిరుపేద కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఐదేళ్ళుగా పోరాటం చేస్తున్నామని వివరించారు. భూపంపిణీ కోసం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీతో పాటు, అర్హులైన రైతులతో కూడిన జాబితాను ఇన్‌చార్జి తహసీల్దార్‌కు అందజేశామన్నారు. అధికారులు వెంటనే స్పందించి పేదరైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోనగిరి కుమారస్వామి, సముద్రాల రాజు, పిట్టల కుమారస్వామి, ఆవుల గణేశ్, రవిందర్, పంగ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయండి.. పట్టాలిస్తాం

గూడూరులో గ్రామస్థులకు అధికారుల సూచన

పాలకుర్తి, జూలై 12 : మండలంలోని గూడూరులో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిరుపయోగంగా మారడంతో గ్రామస్తులు ఆ ఇళ్లలో శుక్రవారం చొరబడ్డారు. విషయం తెలుసుకున్న అధికారులు ఇళ్లలోకి వెళ్లి గ్రామస్తులు వెంటనే ఖాళీ చేయాలని, పదిహేను రోజుల్లో లబ్దిదారులను ఎంపిక చేసి పట్టాలిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సాయిప్రసన్నకుమార్ సూచించారు. ఈ సందర్భంగా వారు ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి శాంతింపచేశారు. 15 రోజుల్లో గ్రామ సభ ఏర్పాటు చేసి లబ్దిదారులను ఎంపిక చేస్తామని, అర్హులైన అందరికీ పట్టాలిస్తామని తెలిపారు. గ్రామస్తులకు నచ్చ చెప్పారు. 15 రోజుల్లో పట్టాలివ్వక పోతే గ్రామస్తులందరం ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అధికారుల సూచన మేరకు ఖాళీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

రోగులకు పండ్ల పంపిణీ

రఘునాథపల్లి, జూలై 12: లయన్స్ క్లబ్ 320 ఎఫ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ సభ్యులు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కందుల అనిల్ కుమార్, కర్మికొండ ప్రదీప్ కుమార్, కోశాధికారి కోళ్ల రాజుగౌడ్, కూరెళ్ల పెద్దఉపేందర్, శంకర్ రెడ్డి, లక్ష్మీనారయణ, కరుణాకర్, సురేష్, రహీం, పీహెచ్‌సీ వైద్యాధికారి కమలహాసన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం - ప్రకృతిని రక్షిద్దాం'



పేపర్‌తో తయారు చేసిన వస్తువులను ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 12: ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని రక్షించుకోవాలని కోరుతూ ఛాగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పేపర్‌తో తయారు చేసిన వస్తువులను ప్రజలకు చూపెడుతూ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే దుష్ప్రయోజనాలు, ఆరోగ్యపరంగా మనుషులకు, జీవరాశులకు ఎలా నష్టాన్ని కల్గ చేస్తున్నాయని వివరిస్తూ ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం అంజిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి ప్రకాశం, రాజేంద్రప్రసాద్, సోమరాజు, వెంకటేశ్వర్లు, వెంటకేష్, విజయకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



అప్పిరెడ్డిపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గడ్డం సమ్మయ్య

దేవరుప్పుల, జూలై 12: ఉద్యోగులకు బదిలీ అనేది సహజమని పద్మశ్రీ గడ్డం సమ్మయ్య అన్నారు. శుక్రవారం అప్పిపల్లిపల్లె యూపీఎస్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు అనేక ఏళ్లుగా తమ విద్యార్థులకు చక్కటి బోధన అందించారన్నారు. అందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు రుణపడి ఉంటారన్నారు. బదిలీపై వెళ్లిన వారిలో వాంకుటోతు బీకోజి, బానోతు దస్రు, పోకల సత్యానారాయణ, జ్యోతి, విమల ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిగిల్ల సుధాకర్, విద్యాకమిటీ మాజీ చైర్మన్ లోనె మహేందర్, హెడ్మాస్టర్ లాల్యానాయక్, ఉపాధ్యాయులు శంకర్, నవీన్, రమేష్, భారతి, ఇందిర, సైదమ్మ, సురేష్, కోమలత తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఘన్‌పూర్ రైల్వే కార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 12: కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రైల్వే కార్మికులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఇంజనీరింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఇల్లెందుల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల పక్షపాతిగా వ్యవహరించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేవరకు ఐక్యంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు కార్మికుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె. భిక్షపతి, పాశం దేవయ్య, కరుణాచారి, శ్యామ్‌యాదవ్, నర్సింహస్వామి, భాస్కర్, బాలరాజు, గడ్డమీది రాజయ్య, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.